
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
బుధవారం ఉష్ణోగ్రత | ఖమ్మం: గరిష్ఠం 31 ; కనిష్ఠం 19 | భద్రాద్రి: గరిష్ఠం 31 ; కనిష్ఠం 19 | గురువారం, 18 జనవరి 2024



స్వాధీనం చేసుకున్నా.. స్వాహా చేశారు..!

- రెండెకరాల ప్రభుత్వభూమి అక్రమార్కుల పరం
- ప్రభుత్వ కార్యాలయాల్లో సదరు భూమి ప్రొసీడింగ్స్ మాయం
- 2013కు ముందు పేదలను ఖాళీ చేయించి.. మరోచోట పట్టాలు
- ప్రస్తుతం రిజిస్ట్రేషన్, ధరణి నిషేధిత జాబితాల్లో కనిపించని వైనం



ఖమ్మం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అక్రమార్కులు తలుచుకుంటే వారు చేసే అక్రమాలకు కాదేదీ అనర్హమన్నట్టుగా ఖమ్మం నగరంలో జరిగిన ప్రభుత్వ భూముల ఆక్రమణలు వ్యవహారాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. కొద్దిరోజులుగా క్రమబద్ధీకరణలు జరిగిన భూముల్లో అక్రమాల వ్యవహారం బయటకు రాగా అందులో పదుల సంఖ్యలో అక్రమ క్రమబద్ధీకరణలు జరిగినట్టు తెలుస్తోంది. ఆయా వ్యవహారా ల్లో తప్పుడు ధ్రువీకరణ పత్రాలను చూపించగా.. ప్రస్తుతం ఖమ్మం నగరంలో రెండెకరాల ప్రభుత్వభూమికి సంబంధించిన రికార్డులే మాయం చేయడం గమనార్హం. అంతేకాదు గతంలో సదరు ప్రభుత్వ భూమి కబ్జా జరిగిందంటూ పదులసంఖ్యలో దరఖాస్తులు ఉన్నతాధికారులకు చేరడంతో దానిపై విచారణ జరిపిన రెవెన్యూ డివిజన్ అధికారులు స్వాధీనం కూడా చేసుకున్నారు. అయినా పదేళ్లకాలంలో ఆ భూమిని కూడా స్వాహా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేదలను ఖాళీ చేయించి.. మరోచోట పట్టాలు

కొన్నేళ్ల క్రితం ఖమ్మం నగరపరిధిలోని శ్రీనివాసనగర్ ప్రాంతంలో సర్వే నెంబరు 344లోని ప్రభుత్వ స్థలంలో పదుల సంఖ్యలో పేదల కుటుంబాలు గుడిసెలు వేసుకుని ఏళ్ల తరబడి నివాసం ఉండేవారు. అయితే అది ప్రభుత్వ స్థలమని చెప్పి అధికారులు వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించి మరోచోట పట్టాలు కూడా ఇచ్చారు. అనంతరం సదరు ప్రభుత్వ స్థలానికి రక్షణ లేకపోవడంతో అక్రమార్కుల కన్ను సదరు ప్రభుత్వ స్థలంపై పడింది. వేరేక్కడో సర్వే నెంబరులోని పత్రాలతో సదరు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నాలు మొదలుపెట్టడంతో స్థానికులు దానిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. దీంతో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం కార్యాలయం నుంచి ఫిబ్రవరి 2013లో 344 సర్వే నెంబరులో ఉన్న 4.32 ఎకరాల భూమి వివరాలను తేల్చాలంటూ సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల కార్యాలయ ఏడీకి ఆర్‌సీ నెం.బి/ఎస్‌పీఎల్/2013 లేఖను పంపించారు. సదరు లేఖకు అనుగుణంగా అదే ఏడాది మార్చిలో రికార్డులను పరిశీలించిన అధికారులు ఏప్రిల్‌లో ఆర్‌సీ నెం ఏ2/365/13 లేఖను తిరిగి పంపారు. అయితే సదరు లేఖలో 1940 పహణీ ప్రకారం అది ప్రభుత్వ భూమి, పోరంబోకుగా నమోదైందని, సంబంధిత సర్వే నెంబరులోని 4.32 ఎకరాల్లో 2.20 ఎకరాలు పోరంబోకు భూమిగా నమోదై మరో వ్యక్తి పొజిషన్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. అది మినహా మిగిలిన భూమి ప్రభుత్వ భూమిగానే నమోదై ఉండగా.. ప్రస్తుతం సదరు భూమి అక్రమార్కులపరం అయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


GOVERNMENT OF ANDHRA PRADESH
From: Assistant Director, Survey and Land Records, Khammam
To: The Tahsildar, Khammam Urban Mandal
Rc.No. A2/365/13

ఏడీ సర్వే నుంచి అర్బన్ ఎమ్మార్వోకు పంపిన కాపీ

ప్రభుత్వ కార్యాలయాల్లో సదరు భూమి ప్రొసీడింగ్స్ మాయం

ఫిర్యాదులు అందిన సమయంలో నేరుగా ఆర్డీవోనే విచారణ నిర్వహించి ఫెన్సింగ్ కూడా తొలగించినట్టు సమాచారం. ఆ సమయంలో సదరు భూమిపై విచారణ నిర్వహించిన ప్రొసీడింగ్‌లకు సంబంధించిన ఫైళ్లు మాయం చేశారన్న ఆరోపణలు లేకపోలేదు. అంతేకాదు సదరు సర్వే నెంబరు ధరణి, రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్లలో నిషేధిత జాబితాలో లేకపోవడం గమనార్హం. దాంతో ఆక్రమణదారులకు అవకాశం కలిసొచ్చినట్టయింది. పక్కన ఉన్న సర్వే నెంబర్లతో వేల గజాల స్థలా న్ని స్వాహా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ప్రస్తుతం అక్రమార్కుల పాలైన సదరు స్థలం బహిరంగ మార్కెట్‌లో రూ.8కోట్లవరకు ఉంటుందన్న ప్రచారంసాగుతోంది. అంతేకాదు ధరణి వచ్చిన అనంతరం ప్రభుత్వ భూముల రికార్డులు మాయమయ్యాయన్న ఆరోపణలకు ఇలాంటి అక్రమాల వ్యవహారాలు బలాన్ని చేకూరుస్తున్నాయి.


REGISTRATION & STAMPS DEPARTMENT
Government of Telangana
Prohibited Properties 2

District Name	Mandal Name	Village	Revenue Survey No
KHAMMAM	KHAMMAM URBAN	KHAMMAM	344

Prohibited Properties in Rural Prohibited Register

రిజిస్ట్రేషన్ శాఖ నిషేధిత జాబితాలో లేని కాపీ

కాగా ఇటీవల కాలంలో రాష్ట్ర రెవెన్యూమంత్రి ఆదేశాలనుకునుగుణంగా నగరంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు పూనుకున్న అధికారులు ఈ తతంగంపై కూడా పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి ప్రభుత్వ ఆస్థులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

జీవో 59 అక్రమాలపై విచారణలో జాప్యం

ప్రభుత్వ స్థలాల రక్షణ దిశగా పటిష్ఠ చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ స్థలాల రక్షణ దిశగా చర్యలకు ఆదేశించినందున, జిల్లాలో సమష్టిగా పని చేసి, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఆదర్శంగా నిలవాలి. ఇటీవల నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, నీటిపారుదల, రిజిస్ట్రేషన్‌శాఖల అధికారులతో ప్రభుత్వ స్థలాల రక్షణ చర్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రస్తావించిన అంశాలు ఇవి. కాగా రెవెన్యూ మంత్రి ఆదేశాలకనుగుణంగా ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు గాను ఖమ్మం మునిసిపల్ కమిషన్‌గా చైర్మన్‌గా, ఖమ్మం ఆర్డీవో మెంబర్ కన్వీనర్‌గా, నగర ఏసీపీ, ఖమ్మం అర్బన్ తహసీల్దార్, నగరపాలక సంస్థ ఉప నగర ప్రణాళిక అధికారి, సహాయ సంచాలకులు సర్వే అండ్ ల్యాండ్ రికార్ఢ్స్, నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్, జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశారు. వాటితో పాటు నగరంలో క్షేత్ర పరిధిలో క్రియాశీలకంగా ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు 4 భూ రక్షణ బృందాలను కూడా ఏర్పాటు చేశారు. అయితే ఆ బృందాలు మాత్రం రికార్డుల పరంగా వారి దృష్టికి వచ్చిన ప్రభుత్వ భూముల ఆక్రమణలపై మాత్రమే విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తుండగా.. 58, 59జీవోల్లో వచ్చిన అక్రమాలను తేల్చడంలోనూ జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటితో పాటు రికార్డులను మాయం చేసి ప్రభుత్వ భూములను మాయం చేసిన అంశాలపై కూడా దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో 'సీతారామ'కు

మంత్రుల బృందం

క్షేత్రస్థాయిలో పనుల పరిశీలనకు భట్టి, తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి



ఖమ్మం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు అనుసంధానం చేయడంతోపాటు ఉమ్మడి జిల్లా భూములను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్ బ్యారేజీ పనులను పరిశీలించేందుకు రాష్ట్రమంత్రుల బృందం అశ్వాపురం రాబోతోంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి త్వరలో అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు చేరుకుని ఎత్తిపోతల పనులతోపాటు సీతమ్మసాగర్ పనులను పరిశీలించనున్నారు. ఈ పరిశీలన అనంతరం సీతారామ ప్రాజెక్టుపై ప్రభు త్వం అంచనాలు సిద్ధం చేయనుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయశాఖ మంత్రి అయిన తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే సీతారామ ప్రాజెక్టుపై చొరవ తీసుకుని అటు హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించడం, మరోవైపు యాతాలకుంటలో జరుగుతున్న టన్నెల్ పనులను పరిశీలించి ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహించారు. వచ్చే వానాకాలం నాటికి పనులు పూర్తి చేయించి కొంతవరకైనా సాగునీరు ఇవ్వాలన్న పట్టుదలతో ఉన్నారు తుమ్మల. ఈ క్రమంలోనే క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించి తక్షణం అవసరాల కోసం నిధులు కేటాయింపులు, చేయాల్సిన పనులకు తీసుకోవాల్సినే చర్యలపై ప్రభుత్వం కసరత్తు మొదలుపెడుతోంది. అయితే సీతమ్మసాగర్ బ్యారేజీ పనులను తక్షణమే ఆపేయాలని ఇటీవల ఆదేశించిన కేంద్రం.. ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సూచించింది. అలాగే ప్రాజెక్టు నిర్మాణంలో ఉల్లంఘనలు జరుగుతున్నాయని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనల పత్రాలను సమర్పించాలని ఇటీవల కేంద్రం ఆదేశించడంతో సీతారామ పనులు వివాదంగా మారాయి. అయితే వాస్తవంగా జరిగిన పనులపై ప్రభుత్వం నుంచి కేంద్రానికి నివేదిక ఇవ్వాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే మంత్రుల బృందం సీతారామ, సీతమ్మసాగర్ ఎత్తిపోతల పనులను పరిశీలించనున్నారు.

పథకాలకు నిధుల కొరత..

ఇప్పటికే సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి నిధుల కొరత ఉంది. సీతారామ ఎత్తిపోతలకు రూ.7500కోట్లు అవసరం ఉండగా, సీతమ్మసాగర్‌కు మరో రూ.1771 కోట్లు అవసరం. ఈ నిధులు మంజూరైతేనే సీతారామ ఎత్తిపోతల సీతమ్మసాగర్ బ్యారేజీ పనులు పుంజుకునే అవకాశం ఉంది. గత ప్రభుత్వం సీతారామ పనులపై ప్రత్యేక దృష్టిపెట్టకపోవడం, సమీక్షలు చేపట్టకపోవడంతో పనులన్నీ గందరగోళంగా మారాయి. ప్యాకేజీల్లో వరుసక్రమంలో పనులు, టెండర్లు పూర్తిచేయకుండా చివరి పనులకు టెండర్లు వేయడం, మధ్యలో పనులు ఆపేయడం లాంటి కష్టాలు ఎదురయ్యాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉన్నప్పుడు సీతారామ పనులకు నాటి సీఎం కేసీఆర్‌తో శంకుస్థాపన చేయించి పనులు శరవేగంగా చేపట్టారు. కానీ 2018లో తుమ్మల ఓటమి తర్వాత సీతారామపనులు నత్తనడకన సాగాయి. ప్రభుత్వం కాళేశ్వరంపైనే దృష్టిపెట్టి సీతారామకు నిధుల కేటాయింపులు పెద్దగా చేయకపోవడం, బ్యాంకు రుణాలతోనే పనులు ముడిపెట్టడంతో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుతోపాటు సీతమ్మసాగర్ బ్యారేజీనిర్మాణ పనులకు కష్టకాలం ఎదురైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాకు చెందిన మంత్రులు ముఖ్యంగా తుమ్మల సీతారామప్రాజెక్టును పూర్తిచేయించడంపై దృష్టి పెట్టారు. అలాగే సీతారామ పూర్తిచేసి గోదావరి జలాలతో ఉమ్మడి జిల్లా రైతుల కాళ్లు కడుగుతానని తుమ్మల హామీ ఇచ్చిన నేపథ్యంలో మళ్లీ సీతారామ పనులను వేగిరం చేయడంపై దృష్టిపెట్టారు.

మామిడిగుండాల భూవివాదంపై కదలిక

- హైకోర్టు ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం
- 24న గిరిజన రైతులు, పట్టాదారుల సమక్షంలో సర్వే
- నాలుగు దశాబ్దాల సమస్యకు పరిష్కారం దక్కేనా?

ఇల్లెందురూరల్, జనవరి 17: ఇల్లెందు మండలం మామిడిగుండాల సీలింగ్ భూముల వివాదానికి శాశ్వత పరిష్కారం కోసం ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు ముందుకు వచ్చారు. హైకోర్టు ఆదేశాలతో కలెక్టర్ సర్వేకు ఉపక్రమించారు. మామిడిగుండాల సీలింగ్ భూములలో ప్రస్తుతం సాగులో ఉన్న రైతులను గుర్తించేందుకు సర్వే చేపట్టాలని స్థానిక రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ప్రియాంక అలా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులతో నాలుగు దశాబ్దాలుగా గిరిజన రైతులకు, పట్టాదారులకు మధ్య నలుగుతున్న 4,204ఎకరాల సీలింగ్ భూముల వివాదానికి తెరపడుతుందని గిరిజన ఆదివాసీ రైతులు ఎదురుచూస్తున్నారు. ఈనెల 24న మామిడిగుండాలలో ఉన్న సీలింగ్ భూముల సర్వేకు సీలింగ్ భూముల పట్టాదారులు, సాగులో ఉన్న గిరిజన రైతులు హాజరుకావాలని రెవెన్యూ అధికారులు మామిడిగుండాల పంచాయతీ కార్యాలయంలో నోటీసులు అంటించారు. 24న సాగులో ఉన్న గిరిజన రైతులు, వారి వారసులు, సీలింగ్ భూముల పట్టాదారులు హాజరుకావాలని ఇరుపక్షాల ఆధ్వర్యంలో సాగులో ఉన్న నిజమైన రైతులను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టనున్నారు.

నాలుగు దశాబ్దాల సమస్యకు తెరపడేనా ?

ఇల్లెందు మండలం మామిడిగుండాల రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 130లో ఉన్న 4,204 ఎకరాల ప్రభుత్వ భూమిపై గత నాలుగు దశాబ్దాలుగా వివాదం కొనసాగుతూనే ఉంది. పట్టాదారులైన భూస్వాములకు, సాగుచేస్తున్న గిరిజన ఆదివాసీ రైతులకు మధ్య ప్రతి ఏడాది ఘర్షణ, తోపులాటలు, పోలీస్, కోర్టు కేసులు నిత్య కృత్యంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా, ఎమ్మెల్యేలు మారుతున్నా ఆ సీలింగ్ భూ సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు. నాలుగు దశాబ్ధాలుగా అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని సమస్యకు హైకోర్టు జోక్యంతో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు సర్వేకు సిద్ధమయ్యారు.

ఇదీ వివాదం..

మామిడిగుండాల రెవెన్యూ పరిధిలో నెమురుగోమ్ముల రాఘవేందర్‌రావు పేరు మీద సర్వే నెంబర్ 130లో ఉన్న 4,204ఎకరాల పట్టాభూమిలో అప్పటి ప్రభుత్వం సీలింగ్ యాక్టు ప్రకారం 2,800ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని పేదలకు పంచింది. మామిడిగుండాల రెవెన్యూ పరిధిలోని ఉన్న మామిడిగుండాల, బోటిగుంపు, రాజ్యతండా, మేడికుంట, చాపలవారిగుంపు, సువర్ణపురం గ్రామాలకు చెందిన గిరిజన ఆదివాసీ రైతులకు ప్రభుత్వం సీలింగ్ యాక్టు ప్రకారం 1985లో 448మంది రైతులకు ఐదు ఎకరాల చొప్పున ప్రభుత్వం భూమి కేటాయించి ప్రొవిజినల్ పట్టాలు సైతం అందించింది. పట్టాలు అందించిన అధికారులు రైతులకు భూహద్దులు(గెట్లు) పెట్టకపోవడంతో రైతులకు, సీలింగ్ పట్టాదారులకు(భూస్వాములకు)మధ్య ఏటా ఘర్షణ జరగడం, పోలీసు కేసులు నమోదు కావడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో 2013లో తీవ్రస్థాయిలో ఘర్షణ జరగడంతో పట్టాదారులు 74మంది గిరిజన రైతులపై కేసు పెట్టారు. గిరిజన రైతులు తమకు ప్రభుత్వం ఇచ్చిన ప్రొవిజనల్ పట్టాలు కోర్టుకు సమర్పించగా, పట్టాదారులు రైతులు సాగు చేసుకుంటున్న భూమి తమదే అని నిరుపించకపోవడంతో స్థానిక కోర్టు ఆ కేసును గతేడాది కొట్టివేసింది. దాంతో పట్టాదారులు(భూస్వాములు)హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మారోమారు సర్వే చేపట్టానున్నారు. గతంలో సైతం అధికారులు సర్వేలు చేసినా సమస్యకు పరిష్కారం లభించలేదు. ఈ వివాదంపై రెండేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ చొరవ తీసుకొని స్థానిక రైతులతో కమిటీ ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులతో సర్వే చేయించినా వివాదం కోర్టు పరిధిలో ఉండడంతో అధికారులు ముందుకు అడుగు వేయలేక పోయారు. ప్రస్తుతం హైకోర్టు ఇచ్చిన అదేశాలతో ప్రభుత్వ అధికారులు సర్వేకు ముందుకు వచ్చారు. నాలుగు దశాబ్ధాలుగా నలుగుతున్న వివాదానికి ఇకనైనాశాశ్వత పరిష్కారం లభిస్తుందని గిరిజన ఆదివాసీ రైతులు ఎదురుచూస్తున్నారు.


మామిడిగుండాలలో ఉన్న సీలింగ్ భూములు(ఫైల్)

శ్రీరామనవమి పనులకు టెండర్లు

- మొత్తం 19పనులకు రూ.1.42కోట్ల అంచనా బడ్జెట్
- టెండర్ దాఖలుకు 31వరకు గడువు

భద్రాచలం, జనవరి 17: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 17, 18తేదీల్లో నిర్వహించే శ్రీరామనవమి, మహాపట్టాభిషేకాలకు సంబంధించిన ఏర్పాట్లు, భక్తుల మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.1.42,29,000తో ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా దేవస్థానం టెండర్లను ఆహ్వానించింది. టెండర్ దరఖాస్తులను బుధవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, ఈనెల 31వ తేదీ ఉదయం 11గంటల వరకు టెండర్లను దాఖలు చేసుకోవచ్చని దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి తెలిపారు. ఫైనాన్సియల్ బిడ్‌ను 31న ఉదయం 11-30 గంటలకు tender.telangana.gov.inలో చూడాలన్నారు. మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి, పర్ణశాలలో విగ్రహాలకు పంచరంగులు వేసేందుకు రూ.9.80లక్షలు, తాత్కాలిక వసతి కోసం రూ.2లక్షల 2,30,010చదరపు అడుగులలో సామియానాల ఏర్పాటుకు రూ.18.17లక్షలు కేటాయించారు. అలాగే 15 ప్రసాదం కౌంటర్లు, 60తలంబ్రాల కౌంటర్లు తాత్కాలిక ప్రాతిపదికను ఏర్పాటు చేసేందుకు రూ.90వేలు, 50టన్నుల ఏసీ, 70కూలర్లు కల్యాణమండప ప్రాంగణంలో అద్దె ప్రాతిపదికను ఏర్పాటు చేసేందుకు రూ.9.50 లక్షలు కేటాయించారు. అదేవిదంగా భద్రాద్రి ప్రధాన ఆలయ విద్యుద్దీకరణకు రూ.9.76లక్షలు, స్వాగత ద్వారాల ఏర్పాటుకు రూ.4లక్షలు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లు అద్దె ప్రాతిపదికన కల్యాణం మండపం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు రూ.9.78లక్షలు, గోదావరి ఘాట్, పర్ణశాల, కల్యాణ మండపం వద్ద తాత్కాలిక విద్యుద్దీకరణకు రూ.8.77లక్షలు కేటాయించారు. దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మొత్తం 19పనులను చేపట్టనున్నారు.

విధుల్లో వైద్యసిబ్బంది

నిర్లక్ష్యం చేస్తే చర్యలు

తిరుమలాయపాలెం ఆసుపత్రి ఆకస్మిక తనిఖీలో మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం, జనవరి 17: విధినిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. బుధవారం పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా తిరుమలాయపాలెంలోని వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా సుమారు 40నిమిషాలపాటు ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది హాజరుపట్టికను పరిశీలించి సుమారు 30నుంచి 40మంది వైద్య సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం ఒక స్టాఫ్‌నర్సుతోపాటు ముగ్గురు ఔట్‌సోర్సింగ్‌ఉద్యోగులే ఉండటంతో విస్మయానికి గురయ్యారు. కేవలం నలుగురు మాత్రమే విధుల్లో ఉండడమేంటని ప్రశ్నించారు. అలాగే ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి.. మెడికల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడారు. విధులకు గైర్హాజరవుతున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని వివరణ అడిగారు. ఈ విషయమై కలెక్టర్‌తో చర్చించి విదులకు సక్రమంగా హాజరుకానివారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రూ.కోట్లు వెచ్చించి తిరుమలాయపాలెంలో అధునాతన భవనాన్ని నిర్మించి వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తే ఇక్కడ మాత్రం రోగులకు సరైన వైద్యం అందడంలేదన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని, అవసరమైతే ఆసుపత్రిని అర్ధరాత్రి అయినా తనిఖీ చేస్తానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు బెల్లం శ్రీను, ఎంపీపీ బోడ మంగిలాల్, రాంరెడ్డి చరణ్‌రెడ్డి గోళ్ల లింగయ్య తదితరులున్నారు.

సాగునీరు ఇవ్వాలనే ఉంది..

కానీ జలాశయాల్లో నీరు లేదు : పొంగులేటి

కూసుమంచి : పంటల సాగుకోసం నీరివ్వాలనే ఉందని, కానీ ప్రస్తుత వర్షాభావపరిస్థితుల్లో జలాశయాల్లో నీరు లేదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని తన క్యాంపుకార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కు అందజేసిన ఆయన్ను మాజీ సీడీసీ చైర్మన్ జూకూరి గోపాలరావు, పలువురు రైతులు కలిసి నీరు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. అందుకు స్పందించిన పొంగులేటి వర్షాభావపరిస్థితుల కారణంగా సాగర్ డ్యాంలో నీరు లేదని, ప్రస్తుతం ఉన్న నీరు తాగునీటి అవసరాలకు నిల్వ చేశామన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న చెరుకుపంటలు కాపాడేందుకు నెలకు ఒకతడి చొప్పున మూడుతడులకు ఇస్తామని, కానీ ఇప్పుడుమాత్రం నీరు ఇవ్వలేమన్నారు. ఒకవేళ ఇప్పుడు నీరిచ్చినా వెంటనే నాట్లు వేస్తారని, తర్వాత పంటలకు నీరందక ఎండిపోయి తీవ్ర ంగా నష్టపోయే అవకావశం ఉందన్నారు. నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నా రు. అదేవిధంగా సంక్షేమ పథకాలను అందరికీ అందిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


తిరుమలాయపాలెం వైద్యశాలలో సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

'సీఎంఆర్' ఎప్పుడు పూర్తయ్యేను?

- నత్తనడకన సాగుతున్న మిల్లింగ్
- మరో 13 రోజులే గడువు
- ధాన్యం కేటాయింపులపై ఆరోపణలు
- నేడు హైదరాబాద్‌లో పౌరసరఫరాల శాఖ కమిషనర్, మంత్రి సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 17: కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ సేకరణ గడువును రెండు, మూడు సార్లు పొడిగించినా వేగం కనిపించడం లేదు. 2021-22, 2022-23 వానాకాలం వరకు ఈ సీజన్లలో ఇంకా లక్ష్యాన్ని చేరుకోవడంలేదు. ఈ ఏడాది వానాకాలానికి సంబంధించి ఇంకా 84వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. అధికారులు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించినా మిల్లింగ్ మాత్రం నత్తను తలపిస్తోంది. జనవరి 31నాటికి పూర్తిస్థాయిలో సీఎంఆర్ బియ్యాన్ని కేటాయించాలని లేదంటే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు పదేపదే హెచ్చరించినా మిల్లింగ్ మాత్రం కొనసాగుతూనే ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా నేడు హైదరాబాద్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్, మంత్రులు సీఎంఆర్ బియ్యం, మిల్లర్లకు కేటాయింపు తదితర అంశాలపై అన్ని జిల్లాల డీఎంలు, డీఎస్వోలతో సమీక్షించనున్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 2,72,592.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు కేటాయించారు. ఇప్పటి వరకు 1,82,790.022 మిల్లర్లు ఎఫ్‌సీఐకి డెలివరీ ఇచ్చారు. ఇంకా 84వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని అందించాల్సి ఉంది. ఇప్పటికే ఇంకా 18మిల్లులకు సంబంధించిన బియ్యం రావాల్సి ఉందని అధికారులంటున్నారు.

ఇష్టారాజ్యంగా మిల్లర్లకు కేటాయింపు

ఈ సారి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు జీవో ప్రకారం కాకుండా ఇష్టారాజ్యంగా కేటాయింపులు చేసినట్టు ఆరోపణలున్నాయి. గతంలో నిజాయితీగా నూరుశాతం బియ్యాన్ని డెలివరీ చేసిన మిల్లర్లకు కాకుండా తమ ఇష్టమైన వారికి మిల్లింగ్‌కు కేటాయించి వారినుంచి ప్రతిఫలం పొందినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై మిల్లర్లు వాటి యాజమాన్యాలు బహిరంగంగానే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. సీఎంఆర్ బియ్యం డెలివరీలో ప్రతీఏటా ఖమ్మం జిల్లా ఒకటి, రెండోస్థానంలో ఉండేది.కానీ ఈసారి 22వ స్థానంలో ఉంది. దీనికి జిల్లా పౌరసరఫరాల అధికారులు ఉదాసీనత, అవగాహన లేని కారణంగా ఈ పరిస్థితి తలెత్తినట్టు ఆరోపణలున్నాయి. ఈ స్థాయి అధికారులు పర్యవేక్షణ లోపం లోపాయికారీ ఒప్పందం కారణంగా జిల్లా డిఫాల్ట్ జిల్లాల జాబితాలోకి వెళ్లే ప్రమాదం ఉందని అంటున్నారు.

అధికారులతో పలుమార్లు కలెక్టర్ సమీక్షలు

సీఎంఆర్‌పై కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రతిసారి అధికారులు, మిల్లర్లతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ పలుమార్లు ఎఫ్‌సీఐ గోదాములకు వెళ్లి అటు మిల్లర్లు, ఇటు అధికారులను సమన్వయం చేస్తూ.. ఎక్కడా జాప్యం జరగకుండా సీఎంఆర్ బియ్యాన్ని తక్షణమే దిగుమతి చేసుకునేలా సూచనలు చేశారు. ఈ క్రమంలో 90శాతం మిల్లింగ్ పూర్తి చేసిన యజమానులను ప్రోత్సహించారు. అయినా కొందరు మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. మిల్లింగ్ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్, అదనపు కలెక్టర్ స్థాయి అధికారులు జనవరి31 నాటికి పూర్తి చేయాలంటూ ఆదేశాలిచ్చారు. మిల్లింగ్, ధాన్యం కేటాయింపులో ప్రభుత్వ జీవో ప్రకారం కేటాయింపులు చేశారా లేదా అనే విషయాలపై మంత్రులు, కమిషనర్ స్థాయిలో గురువారం సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో పరిస్థితిని కూడా అధికారులు నివేదించనున్నారు.


సీఎంఆర్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

31 నాటికే గడువు

ఎన్.మధుసూదన్ నాయక్, అదనపు కలెక్టర్

మిల్లర్లకు జనవరి 31నాటికి సీఎంఆర్ గడువు ఇచ్చాం. ఇంకా 84వేల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సిఉంది. ఈలోపు ఇవ్వకుంటే చర్యలు తీసుకోనున్నాం. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఎంఆర్ బియ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

ఎర్రబంగారం ఎన్నియల్లో..!

- ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి
- ఈ సీజన్‌లో తొలిసారిగా 23 వేల బస్తాలు రాక
- కొనుగోళ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

ఖమ్మం మార్కెట్ , జనవరి 17: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (మిర్చి) పోటెత్తింది. సంక్రాంత్రి పండుగ సెలవుల అనంతరం సుమారు 23 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ సీజన్‌లో తొలిసారిగా పంట ఇంత భారీగా రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌కు గత నెల రోజుల నుంచి (కొత్త మిర్చి సీజన్ ప్రారంభం నుంచి) రోజుకు 5వేల బస్తాల నుంచి 10వేల బస్తాల వరకు వస్తుండగా బుధవారం ఒక్కరోజే 23 వేల బస్తాలకు పైగా అమ్మకానికి రావడం విశేషం. కాగా మార్కెట్‌లో తేజా రకం ఎండుమిరపను క్వింటాలు రూ. 21,300ల జెండా పాట ధర నిర్ణయించగా వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలు రూ.6,300ల నుంచి రూ.18,000ల వరకు కొనుగోలు చేశారు. తాలు మిర్చి సైతం రకాన్ని బట్టి క్వింటాలు రూ.7,000 లనుంచి రూ.12,000ల వరకు కొనుగోలు చేశారు. అంతే కాకుండా కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచిన ఏసీ మిర్చి క్వింటాలు రూ.23 వేలు, కొత్త పత్తి క్వింటాలు రూ.6,700 లు పాత పత్తి క్వింటాలు రూ.6,600లు పలికింది. మిర్చి కొనుగోళ్లను వరంగల్ రీజియన్ మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ అజ్మీరా రాజు, మార్కెట్ గ్రేడ్‌టూ సెక్రెటరీ బజారు సమీక్షించారు.



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

కొనుగోళ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పరిశీలించారు. వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ అజ్మీరా రాజుతో కలిసి యార్డులలో తిరుగుతూ కొనుగోళ్ల ప్రక్రియను గమనించారు. జెండాపాట ధర, పంటలకు దక్కుతున్న ధరలపై అధికారులతో కలిసి ఆరాతీశారు. కాగా పంటను యార్డులలో దారి లేకుండా అడ్డదిడ్డంగా దిగుమతి చేయడాన్ని గమనించిన ఆయన పంటను క్రమ పద్ధతిన ఉంచాలని కాంటాలకు, పంట తోలకాలు చేసే ట్రాలీ వాహనాలకు దారి ఉంచి పంటను దిగుమతి చేసుకోవాలని సూచించారు.

హమాలీల ఆగడాలు

- మిర్చి మార్కెట్‌లో రైతుల నుంచి పంటను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్న వైనం
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

ఖమ్మం మార్కెట్ జనవరి 17: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో హమాలీల చేతివాటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పులు చేసి ఆరుకాలం కష్టించి పండించిన పంటను అమ్మకానికి మార్కెట్‌కు తీసుకొస్తే హమాలీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులకు చెందిన బస్తాలలోని పంటను తీసి తమకు సంబందించిన మహిళల సంచులలో నింపుతూ ఆగడాలకు పాల్పడుతున్నారు. బుధవారం మిర్చి యార్డులో జరిగిన ఈ సంఘటనను వీడియో తీసిన ఓ వ్యక్తి షోషల్ మిడియాలో పోస్టు చేయగా అది వైరల్ అయింది. మార్కెట్లో పలువురు కమీషన్ ఏజెంట్ల వద్ద పనిచేసే హమాలీలు కాంటాల దగ్గరనుంచి, ఎగుమతి, దిగుమతి వ్యవహారాలను నిర్వహిస్తుంటారు. ఒకవేళ పంట దగ్గర రైతు అందుబాటులో లేకపోతే హమాలీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులను నిలువుదోపిడీ చేస్తారని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా హమాలీలు, స్వీపర్లు, రెల్లుడు విభాగాలకు చెందిన మహిళలు రైతుకు సంబంధించిన పంటను భిక్షం(ముష్టి విధానం) రూపంలో కొంత పంట ఇవ్వాలని ఒత్తిడి చేస్తుంటారని రైతులు వాపోతున్నారు. ఒక వేళ రైతు ముష్టి ఇవ్వకపోతే శాపనార్థాలు పెడతారని సదరు రైతుకు తాగు నీరు కూడా ఇవ్వరని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ అధికారులు స్పందించి ఈ ముష్టి విధానాన్ని రద్దు చేయాలని కోరుకుంటున్నారు.



రైతుల బస్తాలలోని పంటను తీస్తున్న హమాలీలు

సర్కారుభూమి లెక్కతేలేనా?

- అక్రమార్కుల చేతుల్లో సుమారు రూ.60కోట్ల భూమి
- ఖమ్మంరూరల్ మండలంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు
- గత పాలకులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా సాగిన అక్రమాల పర్వం

ఖమ్మం రూరల్, జనవరి 17: ఖమ్మం నగరానికి ఆనుకుని ఉన్న ఖమ్మం రూరల్ మండలంలోని విలువైన ప్రభుత్వ భూములు నాటి ప్రభుత్వం హయాంలో అధికారుల సాక్షిగా అక్రమార్కుల పాలయ్యాయి. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూములు క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించని పరిస్థితి నెలకొంది. కొందరు రెవెన్యూ అధికారుల అండదండలతో అక్రమార్కులు కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారన్న ఆరోప ణలు బలంగా ఉన్నాయి. గత ప్రభుత్వం ఇలాంటి సర్కారు భూములపై దృష్టి సారించకపోవడంతో ఖమ్మం రూరల్ మండలంలోని భూములు ఆక్రమణకు గురయ్యాయి. అయితే ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల లెక్కలు తేలుస్తామని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం, దానిపై దృష్టి సారించిన నేపథ్యంలో ఖమ్మం రూరల్ మండలంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల లెక్కతేలుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

పేదలు, ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయింపు

ఏదులాపురం రెవెన్యూ, పెద్దతండా పంచాయతీలోని సర్వే నెంబర్ 142లో 121 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమికి నాటి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో ఎలాంటి హద్దులు నిర్ణయించలేదు. కేవలం నక్షాలో మాత్రమే కనిపిస్తుంది. ఈ భూమిలో నాయుడుపేట, సత్యనారాయణపురానికి 40ఎకరాలు, ఇందిరమ్మ ఇళ్లకు 25 ఎకరాలు, ఇళ్ల నిర్మాణాలకు 25 ఎకరాలు, బైపాస్ నిర్మాణానికి ఎకరం, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి 2.34 ఎకరాలు, పశువైద్యాశాలకు అర ఎక రం, డ్వామా కార్యాలయానికి 22గుంటలు, రిజిస్ట్రార్ కార్యాలయానికి అరెకరం, విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎకరం, శ్మ శాన వాటికకు ఎకరం, జీవో నెంబర్ 58, 59 కింద ఇళ్ల పట్టాల మంజూరు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఎక్సైజ్ కార్యాలయం, అసైన్‌మెంట్ ఇలా మొత్తం 106 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది.. అవి పోగా 15 ఎకరాలు మాత్రం రికార్డుల్లో ఉంది. కానీ క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని, మొత్తం కబ్జాకు గురైనట్లు ఆరోపణన్నాయి.



142 సర్వే నెంబర్‌లో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన కాలనీ ప్రదేశం

ఆక్రమణలో రూ.60కోట్ల భూమి

రూరల్ మండలంలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సాధారణ ప్రజలు ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసే పరిస్థితిలేకుండా పోయింది. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉండటంతో ఇక్కడ భూములకు రెక్కలొచ్చాయి. పెద్దతండా, ఏదులాపురం, సత్యనారాయణపురం ప్రాంతాల్లో ఎకరం సుమారు రూ.4కోట్ల వరకు పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఆక్రమణకు గురైన ఏదులాపురం రెవెన్యూ 142 సర్వేనంబర్‌లోని 15 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ.60కోట్ల వరకు ఉంటుందన్న అభిప్రాయాలున్నాయి. గతంలో అక్రమార్కులు కొందరు.. ఇక్కడ పనిచేసిన కొందరు రెవెన్యూ అధికారుల అండదండలతో ఈ ప్రభుత్వ భూమిని అక్రమార్కులు ఆక్రమించుకున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే ఈ ప్రాంతంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతున్న క్రమంలో రియల్ ముసుగులో కొందరు వ్యాపారులు వారి భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతోనే ఈ ఆక్రమణలు పెద్దఎత్తున జరిగాయని.. ప్రస్తుత ప్రభుత్వమైనా దృష్టి పెట్టి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతున్నారు.

తహసీల్దార్ రామకృష్ణ ఏమంటున్నారంటే..

ఆక్రమణకు గురైన 142 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమికి సంబంధించి పూర్తిస్థాయిలో సర్వేచేసి ఆక్రమణలను వెలికితీసి ప్రభుత్వ, ప్రజల అవసరాలకు వినియోగిస్తామని ఖమ్మం రూరల్ తహసీల్దార్ రామకృష్ణ పేర్కొన్నారు.

రక్షణకు ప్రాధాన్యమిచ్చి బొగ్గు ఉత్పత్తి చేయాలి

- మైనింగ్ సావర్కర్ డైరెక్టర్ ఉమేష్
- కొత్తగూడెం ఏరియాలోని పీవీకే 5 ఇంక్లైన్ సందర్శన

రుద్రంపూర్ (సింగరేణి), జనవరి 17: రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, రక్షణతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేయాలని మైనింగ్ సావర్కర్ డైరెక్టర్ ఎం ఉమేష్, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ సనత్ కుమార్ అన్నారు. కొత్తగూడెం సింగరేణి ఏరియాలోని పి.వి.కే 5 ఇంక్లైన్‌ను బుధవారం వారు సందర్శించారు. పి.వి.కే 5 ఇంక్లైన్ మైన్‌లో బొగ్గు, ఉత్పత్తి, రవాణా, మ్యాన్‌పవర్ (మెన్ ఆన్ రోల్) కేజ్, మ్యాన్ రైడింగ్ సిస్టమ్ పనితీరు గురించి పి.వి.కే 5 ఇంక్లైన్ మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, ఏజెంట్ రవిందర్‌ను అడిగి తెలుసుకొని వారు సర్వే ప్లాన్‌లను పరిశీలించారు. మైనింగ్ డైరెక్టర్ మాట్లాడారు. రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, రక్షణతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేయాలని సూచించారు. పి.వి.కే 5 ఇంక్లైన్ అండర్ గ్రౌండ్‌లోని కంటిన్యూస్ మైనర్ సెక్షన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జీఎం(సేఫ్టీ) కె గురవయ్య, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం శాలేంరాజు, జీఎం సేఫ్టీ (కొత్తగూడెం రీజియన్) జె కుమారస్వామి, ఎస్‌వో కోటిరెడ్డి, గ్రూప్ ఇంజనీర్ ఉపేందర్, పి.వి.కే 5 ఇంక్లైన్ రక్షణ అధికారి మొయినుద్దీన్, సర్వే ఆఫీసర్ ప్రదీప్, పీఓ అజయ్ ఉన్నారు.



డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏరియా జీఎం

పామాయిల్ నష్టాన్ని అధికారులకు నివేదిస్తా

- ఉద్యాన శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ

సత్తుపల్లి, జనవరి17: ఇటీవల కాపు రాకపోవడం, చనిపోయిన పామాయిల్ తోటలను బుధవారం హార్టికల్చర్ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ ఆయిల్‌ఫెడ్ అధికారులు, రైతులతో కలసి సందర్శించారు. సత్తుపల్లి మండలం నారాయణ పురంలో పామాయిల్ సాగు చేపట్టిన నష్టపోయిన బాధిత రైతు పుచ్చకాయల సోమిరెడ్డి నష్టాన్ని వివరిస్తూ ఉద్యానవన శాఖ రాష్ట్ర కమిషనర్‌కు లేఖ రాయగా ఆయన ఆదేశాల మేరకు తోటలను పరిశీలించేందుకు వచ్చినట్లు పీడీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా పామాయిల్ తోటలో ప్రతి మొక్కను క్షుణ్ణంగా పరిశీలించి నమూనాలను సేకరించారు. పంట నష్టానికి కారణాలు, మొక్క స్థితిగతులు, కాపు దశ, యాజమాన్య పద్ధతులు, వాతావరణ పరిస్థితులు, అంతర పంటలతో మొదటి నుంచి సాగు చేపట్టిన విధానం తదితర అంశాలను ఆయన నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ రైతులతో మాట్లాడుతూ నష్టనివారణ చర్యలలో భాగంగా సేకరించిన నివేదికలను అధికారులకు తెలియజేస్తానని చెప్పారు. రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులకు నివేదిస్తానని, వారి ఆవేదనకు న్యాయం జరిగేలా చర్యలు ఉంటాయని తెలిపారు. ఆయన వెంట ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర కన్సల్టెంట్ రాజశేఖరరెడ్డి, ఆయిల్‌ఫెడ్ డీఎం భారతి, ఫీల్డ్ ఆఫీసర్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ పీడీ రమణ

టేకులపల్లి ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

- అనుకూలంగా 11మంది ఓటు
- పదవి కోల్పోయిన భూక్యా రాధ

టేకులపల్లి, జనవరి 17: టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధపై పెట్టిన అవిశ్వాస తీర్మాణం బుధవారం నెగ్గిందని కొత్తగూడెం ఆర్డీవో శిరీష తెలిపారు. గత ఏడాది డిసెంబరు 15, 20న ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెడతున్నట్టు 14మంది ఎంపీటీసీ సభ్యుల్లో 11మంది సభ్యులు సంతకాలతో ఆర్డీవో, కలెక్టర్, ఎంపీడీవోలకు వినతి పత్రాలు అందజేశారు. అవిశ్వాస తీర్మాణంలో భాగస్వాములైన ఎంపీటీసీ సభ్యులందరికీ బలనిరూపణకు బుధవారం టేకులపల్లి మండల పరిషత్ కార్యాలయం మీటింగ్‌హాల్‌లో జరిగే సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. దీంతో బుధవారం స్థానిక ఎంపీడీవో కోట వీరబాబు ఆధ్వర్యంలో అవిశ్వాస ఓటింగ్‌కు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక సమావేశం కొత్తగూడెం ఆర్డీవో శిరీష సమక్షంలో నిర్వహించారు. 14మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఎంపీపీ అధ్యక్షురాలు భూక్యా రాధ, దాసుతండా ఎంపీటీసీ సభ్యులు భూక్యా బాలకృష్ణ, టేకులపల్లి ఎంపీటీసీ సభ్యులు జాలాది అప్పారావులు హాజరు కాలేదు. మిగతా బిల్లుడుతండా ఎంపీటీసీ భూక్యా శంకర్, బేతంపూడి ఎంపీటీసీ బానోతు పూర్ణ, పెగళ్లపాడు ఎంపీటీసీ బానోతు సరోజినీ, తడికలపూడి ఎంపీటీసీ బానోతు మౌనికా, కోయగూడెం ఎంపీటీసీ జాల సంధ్యా, గంగారం ఎంపీటీసీ భట్టు శైలజా, సులానగర్ ఎంపీటీసీ ఉండేటి ప్రసాద్, కిష్టారం ఎంపీటీసీ పూనెం స్వప్న, కొప్పురాయి ఎంపీటీసీ చింతా శాంతకుమారి, బద్దుతండా ఎంపీటీసీ ఊకే రామకృష్ణ, గొల్లపల్లి ఎంపీటీసీ వాంకుడోతు ధనలక్ష్మీలు హాజరై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తే విధానంలో ఓట్లు వేశారు. దీంతో అవిశ్వాస తీర్మాణం నెగ్గిందని, ఈ విషయాన్ని కలెక్టర్‌కు పంపించనున్నట్టు ఆర్డీవో శిరీష ప్రకటించారు. సమావేశంలో తహసీల్దార్ కృష్ణవేణి పాల్గొన్నారు. కాగ కొత్త ఎంపీపీ పదవీ కోసం కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. టేకులపల్లి ఎంపీపీ స్థానం ఎస్టీ జనరల్ కావడంతో ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో పురుష ఎంపీటీసీలు కూడ ఎంపీపీ పదవీ కోసం పోటీ పడుతున్నట్టు సమాచారం.

శ్రీవారి నిత్యాన్నదానానికి విరాళం



చెక్కు అందజేస్తున్న దాత

ఎర్రుపాలెం జనవరి 17: మండలంలోని తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి దాతలు బుధవారం విరాళాన్ని అందజేశారు. ఖమ్మం పట్టణానికి చెందిన నాగినేని నరసింహాస్వామి తన భార్య సత్యవతి జ్ఞాపకార్థం శ్రీవారి నిత్య శాశ్వత అన్నదానం నిర్వహించేందుకు రూ.50 వేల చెక్కును ఆలయ సూపరిండెంట్ కె.విజయకుమారి కి వారి కుటుంబ సమేతంగా అందజేశారు. శ్రీవారి దర్శనానికి విచ్చేస్తున్న భక్తుల ఆకలి తీర్చే ఈ అన్నదాన పథకానికి విరాళమివ్వడం అదృష్టంగా భావిస్తున్నానని దాత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు విజయదేవశర్మ, ఆలయ సిబ్బంది సోమయ్య, కృష్ణప్రసాద్, సాయి, వంశీ, విజయ, మస్తాన్ పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ వాహనం సీజ్

● రుణం చెల్లించకపోవడంతో స్వాధీనం చేసుకున్న డీసీసీబీ అధికారులు

ఖమ్మంవ్యవసాయం, జనవరి 17: ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు కారును డీసీసీబీ అధికారులు సీజ్ చేశారు. 2018లో ఆయన వాహనం కొనుగోలుకు రూ.26.50లక్షల రుణం తీసుకున్నారు. అయితే ఆ రుణం ఆయన తిరిగి చెల్లించలేదు. దాంతో బుధవారం ఆ వాహనాన్ని అధికారులు సీజ్ చేశారు. ఈ విషయాన్ని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు.

మున్నేరులో మునిగి మత్స్యకారుడి మృతి

ఖమ్మం రూరల్, జనవరి 17: ప్రమాదవశాత్తు మున్నేరులో పడి ఓ మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, తీర్థాల మున్నేరువద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిదిలోని కామంచికల్ గ్రామానికి చెందిన మత్స్యకారుడు లింగనబోయిన ముత్తయ్య (60) ప్రతిరోజు మున్నేరులో చేపలవేటకు వెలుతుంటాడు. అయితే రోజులాగే మంగళవారం కూడా తీర్థాలవద్ద మున్నేరులో చేపలవేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. బుదవారం తెల్లవారు జామున చేపల వేటకు వెల్లిన మత్స్యకారులకు ముత్తయ్య చెక్ డ్యాంవద్ద నీటిపై తేలియాడుతు కనిపించాడు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ముత్తయ్య మృతదేహన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు ముత్తయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిదంగా సీపీఐ నాయకులు కర్ణకుమార్, వెంకటరామనర్సయ్య, మోహన్‌రావు, వెంకటకృష్ణ, జంగాల ఉపేందర్, వాసు తదితరులు ముత్తయ్య మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చంద్రుగొండ, జనవరి 17: చంద్రుగొండ మండల పరిధిలోని రావికంపాడుకు చెందిన రైతు కుక్కల శ్రీనివాసరావు(45) బుధవారం విదుత్‌షాక్‌తో మృతి చెందాడు. శ్రీనివాసరావు ఉదయం తన పొలంలో వ్యవసాయ పనులు చేసేందుకు వెళ్లాడు. అక్కడకు వెళ్లిన తరువాత వరి మండిలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం సపోర్టు వైరును తొలిగిస్తుండగా షాక్‌కు గరయ్యాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో కొంతసేపటి తరువాత అటు వైపు వెళుతున్న తోటి రైతు ఒకరు శ్రీనివాసరావు మృతి చెందిన విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడికి భార్య సుజాతతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో చంద్రుగొండ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

● ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తిపై కేసు నమోదు

టేకులపల్లి, జనవరి 17: ఓ మహిళను ఆత్మహత్యకు ప్రేరేపించడం వల్ల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పాతతండాలో బుధవారం చోటుచేసుకొంది. ఈ ఘటనలో పాతతండాకు చెందిన లాకావతు సునీత (34) మంగళవారం పురుగులమందుల మందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డి కథనం ప్రకారం పాతతండాకు చెందిన వితంతువు సునీతతో కొత్తతండాకు చెందిన దారావతు రమేష్‌కు రెండేళ్లగా వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో రమేష్ ఇంట్లో భార్యభర్తల మధ్య తరుచుగొడవలు జరుగుతున్నాయి. నీ వల్ల మా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని పేర్కొంటూ రమేష్ మంగళవారం సునీతతో గొడవపడ్డాడు. దీంతో మనస్థాపానికి గురైన సునీత ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే కొత్తగూడెం ప్రవేటు ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తుండగా బుధవారం మృతి చెందింది. మృతురాలి తల్లి బానోతు మాంగ్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు. కాగ మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ఉరి వేసుకుని వివాహిత..

ఖమ్మం క్రైం, జనవరి 17: అప్పుల బాధ, కూతురు వివాహం చేయలేక పోయానని బాధతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని పంపింగ్ వెల్‌రోడ్‌లో నివసించే గంజి సుబ్బలక్ష్మి(52) భర్త సత్యనారాయణరెడ్డి 19 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో సుబ్బలక్ష్మి కిరాణా షాపుతో పాటు చిన్న చిన్న చిట్టీలు నిర్వహిస్తూ కుమారుడు, కుమార్తెలతో జీవిస్తుంది. కొద్ది రోజులుగా కిరాణాషాపు సరిగా నడవకపోవటం, చిట్టీల్లో నష్టాలు రావటంతో అప్పులపాలైంది. దీనితో పాటు ఆమె కూతురు వివాహం కాలేదని మానసికంగా బాధపడుతూ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఖమ్మం క్రైం, జనవరి 17: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన మేకల సందీప్(26) తన నాలుగు నెలల కుమారుడు అనారోగ్యంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 15న రాత్రి చిన్నారి చికిత్స పొందుతున్న ఆసుపత్రి వద్దకు వచ్చి తన భార్యకు అన్నం బాక్స్ ఇచ్చి జలగంనగర్‌లోని బంధువుల ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో మయూరి సెంటర్ బ్రిడ్జి వద్దకు రాగా ఎదురుగా ఓ ద్విచక్రవాహనదారుడు అతివేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సందీప్ తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు ఈ విషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

వైద్యుడి మృతిపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, జనవరి 17: వైద్యుని మృతిపై ఖమ్మం నగరంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి అనుమానస్పద మృతి కేసు నమోదు అయింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన గుగులోత్ ఉమేష్(37) మహబూబాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో వైద్యునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు కామేపల్లి మండలం బర్లగూడానికి చెందిన అశ్వినితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె కుమారుడు కూడా ఉన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలోని పాండురంగాపురంలో నివసిస్తున్న తన అత్తమామల ఇంటికి భ్యార్య పిల్లలతో కలిసి ఈ నెల 15న ఉమేష్ వచ్చారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి నుంచి ఉమేష్ అన్న రవికి ఫోన్‌చేసి ఉమేష్ చనిపోయాడని సమాచారం ఇచ్చారు. దీంతో మృతుని తండ్రి ఉమేష్ మృతిపై అనుమానం ఉన్నట్లు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ

- తండ్రి మృతి
- రెండేళ్ల కుమారుడికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు, జనవరి 17: జూలూరుపాడులోని పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా రెండేళ్ల కుమారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే మండలంలోని వినోభానగర్ గ్రామానికి చెందిన గుగులోత్ పవన్‌కళ్యాణ్ (25) సంక్రాంతి పండుగకు భార్య సునిత, కుమారుడు కుషాల్‌తో కలిసి రెండు రోజుల క్రితం కొమ్ముగూడెంలోని అత్తగారి ఇంటికి వెళ్ళారు. భార్య సునిత పుట్టింటి వద్దనే ఉండడంతో పవన్‌కళ్యాణ్ తన కుమారుడిని తీసుకొని కొమ్ముగూడెం నుంచి ద్విచక్రవాహనంపై మండలంలోని వినోభానగర్ ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో జూలూరుపాడులోని పోలీస్‌స్టేషన్ సమీపంలో అదే మార్గంలో వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో పవన్‌కళ్యాణ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు కుషాల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు బాలుడిని జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడు కోమాలోకి వెళ్ళాడు. అతనికి వైద్య సిబ్బంది ఆక్సిజన్‌ను ఏర్పాటు చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బాలుడిని ఖమ్మం తీసుకెళ్ళాలని వైద్య సిబ్బంది కుటుంబ సభ్యులకు సూచించారు. దీంతో గంట సేపు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరీక్షించినా 108 వాహనం రాకపోవడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు అంబులెన్సులో బాలుడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రమాదానికి గురైన మరో ద్విచక్రవాహనదారుడు అక్కడి నుంచి వాహనాన్ని తీసుకొని వెళ్ళిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు తెలిపారు. ఇది ఇలా ఉండగా ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన సమీపంలో ఓ కారు అనుమానస్పదంగా నిలిపి ఉంది. దీంతో ఈ ప్రమాదానికి కారుకు ఏమైనా సంబంధం ఉన్నదా అనే కోణంలో పోలీసులు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నారు.



పవన్‌కల్యాణ్ మృతదేహం, చికిత్స పొందుతున్న బాలుడు

పోలీసుల అదుపులో ధాన్యం దొంగలు?

- నిందితులకు పలు చోరీలతో సంబంధం

దుమ్ముగూడెం జనవరి 17: దుమ్ముగూడెం ఆవాసప్రాంతం వర్కుషాపు గోదావరి ఒడ్డున కల్లంలో ధాన్యాన్ని దొంగతనం చేస్తున్న దుండగుడిని రైతు తాటిపూడి రమేష్ మంగళవారం రాత్రి పట్టుకున్నాడు. కొద్ది రోజులు గా కల్లంలో బస్తాల కొద్దీ ధాన్యం మాయమౌతుం డడంతో రైతు మంగళవారం రాత్రి కల్లం వద్ద కాపుకాశా డు. రాత్రి సమయంలో మంగువాయిబా డవకు చెందిన కొందరు దుండగులు రమేష్ కల్లం వద్దకు వచ్చారు. ధాన్యాన్ని బస్తాల్లోకి దొంగతనంగా నింపుతుండడం గమనించిన రైతు రమేష్ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. వారిలో కొందరు పారిపోగా ఒకడు మాత్రమే పట్టుబడ్డాడు. ద్విచక్రవాహనంపై ధాన్యాన్ని మూటలు కట్టి తరలించేందుకు దుండగులు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. పట్టుబడిన దుండగుడితోపాటు ద్విచక్రవాహనాన్ని రైతులు పోలీసుస్టేషన్‌కు స్వాధీనపర్చినట్లు తెలుస్తోంది. పట్టుబడిన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు అదే గ్రామానికి చెందిన ఐదుగురు అనుమానితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. కాగా చోరీ జరిగిన పరిసర ప్రాంతంలో ఇటీవల కాలంలో పలు విద్యుత్ మోటార్లు, ట్రాక్టర్ల బ్యాటరీలు, పశువులు అపహరణకు గురయ్యాయి. పోలీసుల అదుపులో ఉన్న దుండగులకు స్థానికంగా జరిగిన పలు దొంగతనాలతో సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు గుర్తు తెలియని దుండగులు తాటిపూడి రమేష్ పొలంలో ఆరబెట్టిన కల్లం నుంచి పది బస్తాల ధాన్యాన్ని దొంగిలించినట్లు ఎస్ఐ పడాల కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో టెండర్ల ఖరారు

భద్రాచలం, జనవరి 17: భద్రాచలం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఏకలవ్య పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వాటికోసం టెండర్లను నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, గురుకులం ఆర్‌సీవో వెంకటేశ్వర రాజు కమిటీ సభ్యులు సమక్షంలో మంగళవారం విద్యార్థులకు యూనిఫాం కుట్టేందుకు టెండర్ల ప్రక్రియ ద్వారా తక్కువ కోడ్ చేసిన వారికి యూనిఫామ్ దుస్తులను కుట్టే బాధ్యతలను అప్పగించారు. అలాగే విద్యార్థులకు అవసరమైన వివిధ రకాల సామగ్రిని అందజేసేందుకు సైతం టెండర్లను నిర్వహించారు. అందరి ఆమోదంతో పారదర్శకంగా ఈ ప్రక్రియ సాగిందని డీడీ మణెమ్మ తెలిపారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ

సత్తుపల్లి, జనవరి17: రోడ్డుపైకి వాహనంతో వచ్చినప్పుడు భద్రతా నియమాలు తూచాతప్పకుండా పాటిస్తానంటూ వాహన దారులతో సత్తుపల్లి రవాణా శాఖాధికారి సంగం వెంకట పుల్లయ్య ప్రతిజ్ఞ చేయించారు. బుధవారం స్థానిక యూనిట్ కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, వాహనాల బదలాయింపులు కార్యక లాపాలకు వచ్చిన వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘన, ప్రేరేపించడం గానీ లేకుండా ప్రజలందరూ రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి సహకరించాలని ఆయన సూచించారు.


ప్రతిజ్ఞ చేస్తున్న వాహనదారులు

నగర పాలకసంస్థ కౌన్సిల్ సమావేశాలు ఎప్పుడో?

- టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుతో ఆర్థికంగా నష్టపోతున్న దరఖాస్తుదారులు
- పరిష్కారం కాని సమస్యలు



ఖమ్మంకార్పొరేషన్,జనవరి17: ఖమ్మంనగర పాలకసంస్థ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాల ఊసే మరిచారనే విమర్శలు వస్తున్నాయి. సమస్యలు చర్చించటం, అలాగే కార్యాలయంలోని వివిధ విభాగాల తీరును సమీక్షించటం సాధార ణంగా కౌన్సిల్ సమావేశంలో చేయాలి. అయితే కౌన్సిల్ సమావేశాలు నిర్వహించక పోవటంతో పరి పాలనపై పట్టు కోల్పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. నగరంలో పలు సమస్యలు నెలకొనగా వాటిని పట్టించుకున్నవారే లేరని బహిరంగ వ్యాఖ్యలు వస్తున్నాయి.

నూతన మాస్టర్‌ప్లాన్‌ను పట్టించుకొనేవారేరి?

ఖమ్మం నగరపాలకసంస్థ పరిధిలో నూతన మాస్టర్‌ప్లాన్ లేకపో వటంతో నిర్మాణ అనుమతులకు తీవ్ర ఇబ్బందులు కలుగు తున్నాయి. నూతన మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేసి, ముసాయిదా వరకు వచ్చి ఆగిపోయినా పట్టించుకొనేవారు లేరు. పాత మాస్టర్‌ప్లాన్ ప్రకారమే అనుమతులు ఇవ్వటంతో నిర్మాణ అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. కాగా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తే ఇటువంటి సమస్యలపై చర్చించే అవకాశం ఉంటుంది.

ఇష్టారీతిగా టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు..

నగరపాలకసంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో కొంతమంది అధికారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టీఎస్ బీపాస్ ద్వారా వచ్చిన నిర్మాణ అనుమతుల దరఖాస్తులనుచిన్నకారణాలతో నోటీస్‌లోకి తేకుండా తిరస్కరించటంతో దరఖాస్తుదారులు ఆర్థికంగా నష్టపోవటమే కాకుండా, నిర్మాణాలు చేపట్టలేక పోతున్నారు. టీఎస్ బీపాస్‌కు దరఖాస్తు చేసుకోగానే ఫీజు వస్తుంది. సదరు ఫీజు స్థల విస్తీర్ణాన్ని బట్టి లక్షలాది రూపాయలు ఉంటున్నది. దరఖాస్తులను తిరస్కరిస్తే ఫీజు తిరిగి ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ఇటీవలనే ఏకంగా 16దరఖాస్తులను తిరస్కరిం చారు. కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టారాజ్యంగా పని చేస్తున్నారనే దానికి రుజువుగా నిలుస్తున్నది. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. కౌన్సిల్ సమావేశాలు జరిగితే కార్పొరేటర్ల ద్వారా సమస్యలను కమిషనర్, మేయర్ దృష్టికి తేవచ్చు.

మొక్కుబడిగానే గ్రీవెన్స్

కౌన్సిల్ సమావేశాలు ఊసే మరిచినా, ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డేలో సమస్యలు పరిష్కారం కావటంలేదనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొనకపోవటంతో గ్రీవెన్స్‌లో ఇచ్చిన సమస్యల పరిష్కారానికి దరఖాస్తుదారులు నగరపాలకసంస్థ కార్యాల యం చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సి వస్తున్నది. మూడునెలలు గడిచినా తమ సమస్యలు పరిష్కారం కావటంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా దీంతో గ్రీవెన్స్‌కు వచ్చేవారి సంఖ్య తగ్గుతోంది. కౌన్సిల్ సమావేశాలు నిర్వహించక, గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను పట్టించుకోకపోవటంతో ప్రజలు తీవ్రఇబ్బందుల పాలవుతున్నారు.

జిల్లా పౌరసరఫరాల అధికారిగా చందన్‌కుమార్



ఖమ్మం కలెక్టరేట్, జనవరి17: జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా కె చందన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిషనర్ చౌహాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా జి.శ్రీలత అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆమె స్థానంలో వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్న కె చందన్‌కుమార్‌ను ఖమ్మం డీఎస్వోగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. అయితే శ్రీలత జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎంగా బాధ్యతలు నిర్వహిస్తారు.

కళాశాల భవనాలకు నిధుల మంజూరు

మధిర, జనవరి17: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.4కోట్లు నిధులు మంజూరి చేసింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి వి క్రమార్క ఆదేశాలు జారీ చేశారు కళాశాల ప్రిన్సిపాల్ బీ జయదాస్ బుధవారం తెలిపారు. మంగళవారం మధిర పర్యటనలో బాగంగా డిప్యూటీ సీఎం కళాశాలకు వెళ్లినప్పుడు విద్యార్థులు, అధ్యాపకులు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన కలెక్టర్ గౌతమ్, డీఐఈవో రవిబాబులను ప్రణాళికలు తయారుచేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నిధులు మంజూరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి,అన్నదానం

వైరా,జనవరి17: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 28వ వర్ధంతిని గురువారం వైరాలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు తెలిపారు. అన్నదానం చేస్తామని ప్రకటించారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, మన్నేపల్లి ప్రదీప్, నాయకులు కొర్రపాటి రమేష్, మందడపు మధుసూదన్‌రావు, మేదరమెట్ల పూర్ణచంద్రరావు, మద్దిని రామారావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, మురళీ, కాంతారావు, అప్పారావు పాల్గొన్నారు.

21న సంగీత విభావరి

ఖమ్మం, సాంస్కృతికం, జనవరి 17: ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న సాయంత్రం 6 గంటలకు ఖమ్మంలోని జూబ్లీక్లబ్‌లో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎస్‌కే అంజద్ ఒక ప్రకటనలో తెలిపారు.

చిన్నారులకు దుప్పట్లు పంపిణీ

సత్తుపల్లిరూరల్, జనవరి17: చిన్నారులకు ఖమ్మం గ్రేస్‌సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లను అందించారు. గంగారంలోని 15వ బెటాలియన్ కమాండెంట్ పీ.వెంకట్ రాములు బుధవారం వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీ.ఎర్నెస్ట్‌పాల్, వాళ్ల విజయకుమార్, కే.ఏసుబాబు,కే.మాల్యాద్రి, మోహన్, సీహెచ్.ప్రభాకర్ పాల్గొన్నారు.

వ్యాక్సిన్లు క్రమం తప్పకుండా అందించాలి

చింతకాని జనవరి 17: వ్యాధి నిరోధక టీకాలు(వ్యాక్సిన్) క్రమం తప్పకుండా అందించాలని డీఐవో డాక్టర్ ప్రమీల తెలిపారు. బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి అల్తాఫ్ పాల్గొన్నారు.

నేలకొండపల్లి ప్రభుత్వాసుపత్రిలో శవపరీక్షలు షురూ

నేలకొండపల్లి, జనవరి17: నేలకొండపల్లిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లోనే ఇక నుంచీ శవ పరీక్షలు నిర్వహించనున్నట్లు సీహెచ్‌సీవైద్యాధికారి మంగళ చెప్పారు. ఇప్పటి వరకు శవపరీక్షల కోసం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళాల్సి వచ్చేది. దీంతో మృతుల సంబంధీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చేది. అనుమా నాస్పద మృతి కేసులను మాత్రం నిపుణులు లేనందున ఖమ్మం పంపుతామని చెప్పారు. నేలకొండపల్లి, కూసుమంచి, ముదిగొండ మండలాల పరిధిలో జరిగే ప్ర మాదాలలో మృతి చెందే వారిని పోస్టుమార్టం కోసం ఇక నుంచి నేలకొండపల్లి సీహెచ్‌సీకే తరలిస్తారు. ఇటీవల కలెక్టర్ గౌతమ్ నేలకొండపల్లి సీహెచ్‌సీని సంద ర్శించినప్పుడు త్వరలోనే వైద్యులను నియమిస్తామని, జనవరి మొదటి వారం నుంచీ శవ పరీక్షలు సైతం నేలకొండపల్లిలోనే నిర్వహించేలా చర్యలు తీసుకుంటా మని చెప్పారు. ఈ నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను చేశారు.

ఆలయంలో హుండీ చోరీ

వైరా,జనవరి17:వైరారిజర్వాయర్ అలుగుల సమీపంలోని శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలోని హుండీని దొంగలు పగులగొట్టారు. నెలరోజుల నుంచి భక్తులు వేసిన కానుకలు సుమారు రూ.4నుంచి రూ.5వేలను ఎత్తుకెళ్లి ఉంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి గేట్ల రెండు తాళాలు, హుండీ తాళం పగులగొట్టారు. బుధవారం వైరా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంట నమోదు పరిశీలన

ఎర్రుపాలెం, జనవరి17: మండలంలోని అయ్యవారిగూడెంలో పంటవివరాల నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారిని విజయ నిర్మల బుధవారం పరిశీలించారు. వరి, మక్క మిర్చి పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ప్రతీరైతు పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర ఖచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. సొసైటీ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. రైతులు సదరు రసీదులను పంటకాలం పూర్తయ్యేదాక భద్రప రచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో కొండూరి విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ రామారావు, సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు, సెక్రటరీ మోహన్‌రావు, చైర్మన్ అనుమోలు సాంబశివరావు, సెక్రటరీ మోహన్‌రావు, ఏఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహనీయుల బాటలో యువత ముందుకు వెళ్లాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి17: మహనీయుల బాటలో యువత ముందుకు వెళ్లాలని సీపీఎం జిల్లా నాయకులు బండిరమేశ్ పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యులు భారవి, విద్యావేత్త ఐవీ రమణారావు, చింతల రమేశ్ పాల్గొన్నారు.

రామమందిరంపై మోదీ రాజకీయం

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి17: రానున్న లోకసభ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు మతతత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తూ అయోధ్యలో రామ మందిరం నిర్మాణాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజకీయాలు చేస్తున్నారని ప్రజాపంథా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ విమర్శించారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు.

సంక్షేమ ఉద్యోగులతో సమావేశం

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి17: ఖమ్మం కలెక్టరేట్‌లోని సంక్షేమ విభాగాల ఉద్యోగులను టీఎన్‌జీవోస్ కొణిదెన శ్రీనివాస్, దుర్గాప్రసాద్ కలిశారు. బుధవారం ఎస్సీ, డీఆర్‌డీఏ, డ్వామా, ఎస్సీ వెల్ఫేర్ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం దిశగా సంఘం ముందుకు వెళ్తుందని భరోసా కల్పించారు. జైపాల్, గుంటుపల్లి శ్రీనివాస్, వల్లపు వెంకన్న, విజయ్, పుసపాటి శ్రీను, జంగం లక్ష్మణ్‌రావు, తాళ్లూరి శ్రీకాంత్, భరత్, కృష్ణ, కొనార్, రామకృష్ణ, నవీన్, వెంకట్రావు రామారావు, రవిచంద్ర పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి, జనవరి 17: మృతుల కుటుం బాలకు అండగా ఉంటానని, అన్ని రకాలుగా ఆదుకుంటానని రెవెన్యూ శాఖా మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. బోదులబండ గ్రామానికి చెందిన కాకాని వెంకటేశ్వరరావు కుమారుడు, కోడలును ఆశీర్వదించి, పట్టు వస్త్రా లను అందించారు. ఇటీవలనే వీరి వివాహం జరి గింది. తర్వాత నేలకొండపల్లిలో ఏటుకూరి ముత్యాలరావు కుటుంబాన్ని పరామర్శించారు. మధుకాన్ ఉద్యోగి అయిన ముత్యాలరావు వారం క్రితమే గుండెపోటుతో మృతి చెందారు. ఎన్నికల సమయంలో మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు నిమ్మగడ్డ నగేష్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని భార్య నిమ్మగడ్డ గౌరి నేలకొండపల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలిగా ఉన్నారు. అనంతరం మాజీ ఉపసర్పంచ్ రాజపుత్ర శ్రీనివా ససింగ్‌ను పరామర్శించారు.శ్రీనివాససింగ్ తండ్రి దశరథరాంసింగ్ ఇటీవల మృతి చెందారు.

సాగునీటి విడుదలకు కృషి చేస్తా

మంత్రి శ్రీనివాసరెడ్డిని కలిసిన రైతులు చెరుకు పొలాలు ఎండిపోతున్నాయని, పాలేరు నుంచి నీరు వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెర్వుమాదారం చెరువును నింపాలని కొంత మంది రైతులు కోరారు. సాగర్‌లో నీరు లేవని, పాలేరును నింపటానికి అభ్యంతరం లేదని, కానీ నీరు వస్తుంటే నాట్లు వేస్తే ఇబ్బంది కర పరిస్థితులు వస్తాయన్నారు. నాట్లు వేసాక నీరు అందకపోతే రైతులు ఇబ్బంది పడాలని, అధికారులతో చర్చించి నిర్ణయిస్తానన్నారని రైతులు చెప్పారు. కార్యక్రమంలో రాయల నాగే శ్వరరావు, నెల్లూరి భద్రయ్య, వేగినాటి లక్ష్మీన ర్సయ్య, గెల్లా జగన్మోహన్‌రావు, ముత్తినేని వీరయ్య, మోర మల్లయ్య, జొన్నలగడ్డ రవి, వెన్న పూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కుక్కల హనుమంతరావు, షేక్.ఖాజామియా, షేక్.సుభాన్, కడియాల శ్రీనివాసరావు, కట్టెకోల సుధాకర్, గోరంట్ల వెంకటేశ్వరరావు(చంటి), జూకూరి గోపాలరావు, ఆరెకట్ల గురవయ్య, ఎంపీపీ వజ్జా రమ్య పాల్గొన్నారు.

సునితాదేవికి ఘననివాళులు

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు మాజీ సర్పంచ్ రామసహాయం సునితాదేవికి వివిధ పార్టీల నేతలు బుధవారం నివాళులర్పిం చారు. సునీతాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఈ రోజు దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాజీ ఎంపీలు రామసహాయం సురేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుల రామసహాయం నరేష్‌రెడ్డి,రాంరెడ్డి కృష్ణారెడ్డి , టీపీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు మద్ది శ్రీనివాసరెడ్డి, మహిళ కాంగ్రెస్ నాయకులు మద్దినేని స్వర్ణ కుమారి, చావా శివరామకృష్ణ నివాళులర్పించారు. జూపెడ గ్రామానికి చెందిన బొల్లికొండ వీరస్వామి, పాతర్లపాడు మాజీ సర్పంచ్ జోగిరెడ్డి, జింకలగూడేనికి చెందిన గోరేమియా మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శిం చారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లానాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, మద్దినేని స్వర్ణకుమారి, జొన్నలగడ్డ రవి, మద్ది మల్లారెడ్డి, మండల నాయకులు జడల నగేష్, జడల రమేష్, ఓర వెంకటేశ్వర్లు, వనవాసం నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రంగారావును పరామర్శించిన పొంగులేటి

ఖమ్మంసంక్షేమవిభాగం: జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆయన సోదరుడు సుధాకర్ అనారోగ్యంతో కన్నుమూశారు. మృతుని కుటుంబ సభ్యులను పొంగులేటి పరామర్శించారు. నూకల నరేశ్‌రెడ్డి, బేబీ స్వర్ణకుమారి, సీపీఐ నాయకులు సింగునర్సింహారావు, పోటు కళావతి, సముద్రాల శ్రీనివాసరావు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కౌముది రచనలకు మరింత ప్రాచుర్యం కల్పించాలి

ఖమ్మం, సాంస్కృతికం, జనవరి 17: తెలుగు సాహిత్యం గర్వించదగ్గ మహాకవి కౌముది రచనలకు మరింత ప్రాచుర్యం కల్పించి భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. దివంగత కవి కౌముది (షంషుద్దీన్) 27వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఖమ్మంలోని టెండర్ రూట్స్ స్కూల్‌లో సంస్మరణ కార్యక్రమం కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన జరిగింది. అధ్యక్షోపన్యాసంలో ప్రసేన్ మాట్లాడుతూ కౌముది అముద్రిత రచనలను పుస్తకంగా తేవలసిన బాధ్యత ఉందన్నారు. తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో తనదైన ముద్రవేసిన కౌముది ఇప్పటి తరాలకన్నా సాహిత్యంలో ఎంతో ముందున్నారన్నారు. విలేఖరిగా, ఉపాధ్యాయుడిగా , సామాజిక సేవకుడిగా ఆదర్శ జీవనం గడిపారన్నారు. ప్రముఖ విద్యావేత్త రవి మారుత్ మాట్లాడుతూ కౌముదితో తనకు ఎటువంటి పరిచయం లేనప్పటికీ ఇటీవలే ఆయన రచనల గురించి తెలుసుకున్నానని అన్నారు. ఆయన కాలంలోని సాహిత్యశైలినే నేటికీ కొనసాగిస్తుండటం పట్ల కవులు దృష్టి సారించాలన్నారు. తరచూ కవులు కలుసుకోవటం ద్వారా సాహిత్య వ్యాప్తికి తోడ్పడాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త మొగునూరి వెంకటరమణ కౌముది సాహిత్య జీవతాన్ని సమగ్రంగా పరిచయం చేశారు. ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు గ్రహీత ఇబ్రహీం నిర్గున్ కౌముదితో తనకు గల వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ కవి కపిలరాంకుమార్, సీహెచ్ ఆంజనేయులు, షకూర్, విద్యావేత్త ఎంవీ రమణ, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కవయిత్రులు తోట సుభాషిణి, ఉరిమళ్ల సునంద, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి17: జిల్లాలోని ఏడు మైనారిటీ గురుకుల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు, కళాశాలలు 2024-25 విద్యాసంవత్సరానికి 5నుంచి8వతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి ఎంఎం మహమూది తెలిపారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. తల్లిదండ్రుల వార్షికా దాయం పట్టణప్రాంతాల్లో రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షా50వేలు దరఖాస్తు తోపాటు పాస్‌పోర్టు సైజ్‌ఫోటో, ఆధార్‌కార్డు, స్టడీసర్టిఫికెట్, ఆదాయ, కులధృవీకరణ పత్రాలు, విద్యార్థి సెల్‌నెంబర్‌ను తప్పనిసరిగా జత చేయాలన్నారు. మరిన్న వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగిరం చేయాలి

అధికారులతో కలెక్టర్ వీపీ గౌతమ్ సమీక్ష


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్, జనవరి17: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియను వేగిరం చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. 1-11-2020 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు నమోదుపై రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ , ఏఈఆర్వోలతో కలెక్టర్ సమీక్షించారు. వరంగల్- ఖమ్మం- న ల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో జరగబోయే ఉప ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాను రూపొందించాల్సి ఉందన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం తాజాగా ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి షెడ్యూల్‌ను విడుదల చేశారని తెలిపారు. ఏప్రిల్4న తుదిఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. అర్హత తేదీ నవంబర్ 1 2023 కు కనీసం మూడేళ్ల ముందు గ్రాడ్యుయేషన్ తత్సమాన అర్హత పూర్తి చేసి ఉండాలన్నారు. ప్రతి స్థాయిలో చేపట్టాల్సిన ప్రక్రియపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి సత్యప్రసాద్, ఎస్ మధుసూదన్ నాయక్, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఖమ్మం, కల్లూరు ఆర్డీవోలు గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసీ రాజేశ్వరి, డీపీవో హరికిషన్, డీఈవో సోమశేఖరశర్మ, జడ్పీ సీఈవో వింజం వెంకట అప్పారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ బి మాలతి, డీఆర్డీవో విద్యాచందన, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాంబాబు, మాస్టర్ ట్రైనర్ శైలేందర్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ఎంపీవోలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఫిబ్రవరి 14వరకు నిర్వహించనున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ వీపీ గౌతమ్ బుధవారం ఆవిష్కరించారు. ఇటీవల జిల్లాకు నూతనంగా వచ్చిన రవాణాశాఖ అధికారి ఎండీ గౌస్‌పాషా కలెక్టర్‌ను ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు వరప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఫీజు వితరణ



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంవ్యవసాయం, జనవరి17: ఖమ్మం నగరంలోని నాయుడు పేటకు చెందిన మెడికల్ విద్యార్థిని ఉల్లోజు కార్తీశానికి మిత్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.50 వేలు కళాశాల ఫీజును చెల్లించారు. మిత్ర ఫౌండేషన్ కార్యదర్శి రంగా శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఉస్మానియా వర్సిటీ పరిధిలో మెడికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినికి ఆర్థిక సాయం చేశారు. కాగా ఐదు సంవత్సరాలు మెడిసిన్ చదువు పూర్తి అయ్యేవరకు పూర్తి బాధ్యత తీసుకుం టామని మిత్ర చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి డాక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిసాయం

వైరా:గ్రేట్‌విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మీ ఆధ్వర్యంలో డాక్టర్ కాపా లోహిత జన్మదినాన్ని పురస్కరించుకొని కొణిజర్లకు చెందిన విద్యార్థి పందిళ్ల ఉషకు రూ.ఐదువేల బుధవారం అందజేశారు. గొల్లపూడికి చెందిన ఉప్పు అనూషకు కుట్టు మిషన్ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉంద్రు వరలక్ష్మీ, శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, గంగవరపు కిషన్, ఉయ్యూరు రామకృష్ణ, కె.గోపి, మహాలక్ష్మీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాగమయికి షర్మిల కుమారుడి వివాహ ఆహ్వానం

సత్తుపల్లిరూరల్,జనవరి17: ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల తనయుడు వివాహానికి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు బుధవారం ఆహ్వానం అందింది. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గడిపల్లి కవిత, వైఎస్.షర్మిల తరఫున శుభలేఖను ఎమ్మెల్యేకు సత్తుపల్లిలోని ఆమె నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరామ వెంకటేశ్వరరావు, శ్రీరాముల వెంకటేశ్వర్లు, జానకీ రామాచారి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ఏన్కూరు, జనవరి17: మండలంలోని భగవాన్ నాయక్‌తండాలో బుధవారం యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సర్దార్‌బాబు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హాజరై విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, ఎస్ఐ బాదావత్ రవి, నాయకులు మేడ ధర్మారావు, బానోతు రామారావు, యంద్రాతి సాయి, చందమామ నరసింహారావు, స్వర్ణ ప్రహ్లాదరావు, కిషన్ పాల్గొన్నారు

ఓటమిని అసలు ఊహించలేదు : కందాళ

నేలకొండపల్లి,జనవరి17:ఓటమిని అస్సలు ఊహించలేదని, తాను చేసిన అభివృద్ధి తనను గెలిపిస్తుం దనుకున్నానని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కందాళ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ముజ్జుగూడెంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహావి ష్కరణ అనంతరం కందాళ మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని, తాను ఓడిపోతాననుకోలేద న్నారు. అందరూ కలిసి మెలిసి ఉండాలని గొడవలకు పోవద్దన్నారు. కార్యక్రమంలో ఉన్నం బ్రహ్మయ్య, డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, జడ్పీ ఉపాధ్యక్షురాలు మరికంటి ధనలక్ష్మి, నెల్లూరి లీలాప్రసాద్, శాఖ మూరి సతీష్, శీలం వెంకటలక్ష్మి, షేక్.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టితవ్వకాలపై చర్యలు చేపట్టాలి

ఏన్కూరు, జనవరి17: మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని జడ్పీటీసీ బాదావత్ బుజ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆరెం వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనుమతులు ఒకచోట, తవ్వకాలు ఒకచోట జరుగుతున్నాయని ఈ అక్రమ తవ్వకాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసి, తవ్వకాలను నియంత్రించాలని సూచించారు. రేషన్‌బియ్యం పంపిణీ తూకాల్లో తేడా వస్తుందని, దీనిని నియంత్రించాలని ఎంపీటీసీ లచ్చిరాంనాయక్ రెవెన్యూ అధికారులను కోరారు. మండలంలో జరుగుతున్న పనులను ప్రోటోకాల్ పాటించడంలేదని ఎంపీపీ ఆరెంవరలక్ష్మి పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావుపై అసహనం వ్యక్తంచేశారు. మరుసకంట గ్రామానికి మిషన్‌భగీరథ నీరు అందడంలేదని ఎంపీటీసీ లచ్చిరాం నాయక్ ఏఈ సురేష్‌ను నిలదీశారు. ఆర్‌అండ్‌బీశాఖ, ఎక్సైజ్‌శాఖ అధికారులు సమావేశానికి హాజరుకాలేదు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, ఎంపీడీవో తుమ్మలపల్లి కృష్ణ, ఎంఈవో దుగ్గిరాల జయరాజు, మండల వ్యవసాయశాఖ అధికారి ఎనరసింహారావు, సీడీపీవో దయామణి పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రేణుకాచౌదరి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి17: కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి గురువారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 6 గంటలకు హైదరాబాద్‌లో బయలు దేరి ఉదయం 10 గంటలకు ఖమ్మానికి చేరుకుంటారు. ఖమ్మంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం తర్వాత పలు కార్యక్ర మాలకు హాజరు కానున్నారు. ఈ వివరాలను క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జీ పుల్లయ్య వెల్లడించారు.

అక్షరాలతోవ కథల పోటీ విజేతలు వీరే

ఖమ్మంసాంస్కృతికం,జనవరి17: అక్షరాల తోవ సాహిత్యసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీ విజేతల వివరాలను నిర్వాహకులు బుధవారం వెల్లడించారు. మొదటి బహుమతి కళాగోపాల్, ద్వితీయ బహుమతి డివి శివప్రసాద్, తృతీయ బహుమతి పొత్తూరి సీతారామరాజు, తోపాటు నల్లబాటి రాఘవేంద్రరావు, కంచర్ల శ్రీనివాస్‌లకు ప్రోత్సాహక బహుమతులు సాధించారు. ఖమ్మంలో ఈనెలాఖరున జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్, నామా పురుషోత్తం తెలిపారు.